# అంతరార్థం

శ్రీమతి భూపి అన్నపూర్ణాదేవిగారు.

"సరూ! మీ యక్క ముసలిదైనతర్వాత నిన్నుపెళ్లిచేసికుంటానే!" అని-మాబావ నన్నెత్తుకొని గట్టిగ బుగ్గగిల్లాడు.

తలంటుకొన్నతర్వాత, వరండాలో బాలసూర్యునికిరణాల్లో జుట్టు ఆరబెట్టుకుంటోంది మాయక్క ఈజీచెయిరులో కూర్చొని.

బావచంకదిగి, మాఅక్కఒడిలో అమాంతంగకూలబడ్డా. నన్ను ముద్దెట్టుకొని తల నిమురుతూ "కాదే మీబావ నేను చచ్చిపోయినతర్వాత నిన్నుపెళ్లిచేసికుంటారే!" అంది చిరునవ్వుతో.

"ఏమిటా అపశకునపు మాటలు" అన్నాడు బావ కొంచెంకళ్లెర్రచేసి.

"క్షమించండి. కోపంవస్తుందనుకోలేదు. తమాషాకే అంతపట్టించుకొంటే, ఎలాగ?"

"తమాషా అయితేమాత్రం అమంగళపుమాటలా?" అంటూవచ్చి అక్కప్రక్కను కుర్చీలో కూర్చున్నాడు.

"తెలివితక్కువతనంగ ఏమన్నాఅంటే క్షమించాలి." అంది బావచేతిని నొక్కుతూ.

బావ చిరునవ్వుముఖంతో అక్కకేసిచూచాడు. ఆమెముఖంలో చిరునవ్వుతాండవమాడుతుంది. బావ అక్కబుగ్గ గిల్లాడు.

ఒడిలోకూర్చున్ననేను మెల్లగ బావవ్రేలిఉంగరంతీసుకొని నా వ్రేలికి తగిలించుకొన్నా.

"చూచారూ.........సరూ మీ ఉంగరాన్ని కాజేసింది ఇంతలోనే" అంది మా అక్క.

"అరె! చాల పోకిరిదానివయిపోయావె!" అన్నాడు నా బుగ్గగిల్లి.

అప్పుడు నాకు పట్టుమని పదేళ్లుండవు. ఆవేళ ఉగాది. బావ, అక్క, అత్త అందరం 8 గంటలకే స్నానంచేశాం. కుర్చీలోకూర్చొని ఆ లేతసూర్యునికిరణాల్లో తలవిరియపోసికుంది.

బావ మామిడిపిందెలు, వేపపువ్వు బజారునుంచి తీసికొనిరావడానికివెళ్లాడు. అక్కకు అకస్మాత్తుగ అమ్మ జ్ఞాపకానికొచ్చింది. నన్నెత్తుకొని గదిలోనికితీసికొనివెళ్లి గ్రుచ్చినమల్లెపూలు అమ్మఫోటోకితగిలించి నమస్కరించింది. నా ముఖంలోకి ఎంతోదీనంగచూచింది. ఆమెకన్నులనుండి చొటచొటకారిందికన్నీరు. అమ్మను తలంచుకోగానే నాకుకూడ కళ్లనీరు తిరిగింది. అమ్మఫోటోకి చేతులుజోడించాను. అంతలోబావ బజారునుంచివచ్చాడు. అక్కను ఎంతో ఓదార్చాడు.

మా అక్క చాలఅందకత్తె. మా అమ్మ అంతకంటె అందంగాఉండేది. మా యమ్మపోలికలే నాలో కూడ ఉన్నాయంటారు అందరూను. అమ్మజ్ఞాపకానికొచ్చినప్పుడెల్ల, అక్కనన్నెత్తుకొని నా ముఖంలో అదోలాచూచేది.

అందుగురించే, నన్ను తనవెంట అత్తారింటికితీసికొనితెచ్చుకుంది. మా అక్కకు పెండ్లయినసంవత్సరానికే మశూచికంలో అమ్మచనిపోయింది. అక్కనుచూస్తుంటే అమ్మలేనికొఅత కనుపించేదికాదు.

బావ నన్నెంతో ప్రేమగ, జాలిగచూచేవాడు. అంతకంటె ఎక్కువగచూచేది అక్క. బావఎప్పుడైనా ఏదైనా తినడానికితీసికొస్తే అక్కముందు నాకుపెట్టేది. ఇద్దరికి ఎంతో అల్లారు ముద్దుగఉండేదాన్ని.

బావ పాటలునేర్పేవాడు. లెఖ్ఖలుచెప్పేవాడు. తప్పువస్తేమాత్రం గదురుకొనేవాడు. చటుక్కున అక్కవచ్చి "చంటెపిల్ల, గదురుకోకండిమరీని" అని లోపలకుతీసికెళ్లి చేతిలోఏదైనపెట్టేది.

ఒకనాడు అక్క నాచేతిలో లడ్డుపెట్టి తినమంది. మెల్లిగ బావ వెనకాలేవచ్చి, "అంతా మీ చెల్లికే పెట్టుకోకపోతే నా కొహటివ్వగూడదా?" అన్నాడు. మెల్లగ ఒకలడ్డూ బావనోటిలోనికి తోసింది.

"ఏమే సరూ! నామీద నీకుకోపం గదటే?" అన్నాడు. లేదన్నట్లుగ తల నూపాను.

"వొర్రిది కోపంలేకపోతే ఏదీ ఆ లడ్డూనాకియ్యి?" అని నోరుతెరిచాడు.

అక్కఒడిలోనుండి సగం తిన్న ఆ లడ్డూను బావనోటికందించాను. గుటుక్కునమ్రింగాడు కొంటి బావ. అక్క విరగబడినవ్వింది. మరల చెరియొకలడ్డూఇచ్చిందిమాకు. కాని తనకిచ్చినదాన్నితిరిగి అక్కకిచ్చాడుబావ.

* * * *

"సరూ! ఇదిగోతెచ్చాను. మామిడిపిందెలున్నాయిగాని, వేపపూవుదొఅకలేదు. దానికిబదులు వేపచిగురుతెచ్చాను." అంటూగదిలో ప్రవేశించారు మావారు. నేను అమ్మ, అక్కఫోటోలదగ్గరనిలబడి కన్నీటతర్పణమిస్తున్నాను.

"సరూ! సరూ! ఎంతకాలం విచారిస్తేమాత్రం ఏంలాభం. పోయినవాళ్లని తిరిగితీసికొనిరాలేం గదా? అంతామరచిపోవాలి" అన్నారు గద్గదంగ. వీపుతట్టి నన్నుచేయిపట్టుకొని వెలుపలికి తీసికెళ్లారు. వెల్లువలైపారుతుంది మా ఇద్దరికన్నీరు.

హృదయానికి హత్తుకుంటూ నన్ను బుజ్జగించసాగారు. హృదయావేదనఆగక బావురు మన్నాను.

బావురుమంటూలేచింది మాశశి. దాన్నెత్తుకొని అమ్మ, అక్కల పోటోలదగ్గరికితీసికెళ్లి చేతులు మోడ్చాను. చిట్టిశశికూడ చేతులుజోడించింది. వాళ్లనాన్ననుపిల్చి చేతులుజోడించమంది. ఫోటోలకి రెండు వైపులా అగరువత్తులు వెలుగుతున్నాయి.

చిట్టితల్లిదంతా అక్కవాలకమే. అక్కముఖంలోని తాత్వికదృష్టులు ఆమెముఖంలో ప్రస్ఫుటంగ కనుపిస్తున్నాయి. అక్కలాగే, చలనంలేకుండ ప్రేమవేదాంతిలా నా ముఖంలోకి చూస్తుందిశశి. చిట్టితల్లి ముఖంలో అక్కతొంగిచూస్తుందా అనిపించింది.

"సరూ! నేనుచనిపోయినతర్వాత నిన్నుపెళ్లిచేసికుంటారే!" అని ఎప్పుడో.........ఈనాడే అన్న అక్క మాటలు నాచెవుల్లో రింగుమన్నాయి. ఆమెమాటల్లో ఇంత అంతరార్థం ఉందని అప్పట్లోతెలియలేదు.

* * *